క్లుప్తంగా

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వైరారూరల్: మండలంలోని గరికపాడు జెడ్పీ హెచ్ఎస్‌లో పది చదివిన 2014 సంవత్సర బ్యాచ్ విద్యార్థులు సోమవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. హైస్కూల్ ఆవరణలో సందడి చేశారు. ఆనాటి గురువులు, సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గరిడేపల్లి అనీల్‌కుమార్, అఖిల్, ఉప్పల్, శివ, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇనుప కంచె ఏర్పాటు

కారేపల్లి: కారేపల్లిలోని సర్వే నంబర్ 38లో బీసీ హాస్టల్‌కు కేటాయించిన ప్రభుత్వ స్థలంలో రూ.3లక్షల నిధులతో ఇనుప కంచెను సోమవారం ఏర్పాటు చేశారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆ స్థలాన్ని ఆక్రమించి అక్రమ కట్టడాలకు పాల్గొనగా.. గ్రామస్తులు, అధికారులు అడ్డుకున్నారు. దీంతో కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి రూ.3లక్షల నిధులు కేటాయించి ఇనుప కంచె ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం అధికారులు ఇనుప కంచె ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ.. కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తురక నారాయణ, కెతిమాల శ్రీను, పాలిక ముత్తయ్య, సాంబయ్య, పోతు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నియామకం..

బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడిగా కృష్ణారావు



కృష్ణారావు

ఎర్రుపాలెం: బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన కొమ్మినేని కృష్ణారావు, పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా రేమిడిచర్ల గ్రామానికి చెందిన నూతక్కి నర్సింహారావు జిల్లా కమిటీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు నియమించారు.

ఏన్కూరు మండల అధ్యక్షుడిగా..



బొల్లి వెంకటేశ్వర్లు

ఏన్కూరు: బీజేపీ మండల అధ్యక్షుడిగా బొల్లి వెంకటేశ్వర్లను.. జిల్లా అధ్యక్షుడు నెల్లూరు వెంకటేశ్వరావు నియమించారు. ఏన్కూరు మండలం రంగాపురానికి చెందిన బొల్లి వెంకటేశ్వర్లు గత నాలుగు సంవత్సరాలుగా కిసాన్‌మోర్చ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు.

న్యాయమూర్తి మృతికి సంతాపం

మధిర: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి గిరిజ ప్రియదర్శిని అకాల మృతి పట్ల సోమవారం మధిర కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. సమావేశంలో మధిర కోర్టు న్యాయమూర్తి ఎన్.ప్రశాంతి, జూనియర్ సివిల్ జడ్జి దీప్తి ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. ప్రియదర్శిని.. పేద, వెనుకబడిన వర్గాలకు తన విలక్షణ తీర్పులతో న్యాయం చేశారని, ఆమె మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజెడ్ల పుల్లారావు, న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, కోట జ్ఞానేష్, కట్టా పూర్ణచందర్‌రావు, గోపాల్, గంథం శ్రీనివాసరావు, వెంకట్రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె నోటీస్ అందిస్తున్న హమాలీలు

కొణిజర్ల: మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు సుంకర సుధాకర్, అనుమోలు రామారావు పిలుపునిచ్చారు. సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సమ్మెపై వైరా బాటిలింగ్ యూనిట్‌లో హమాలీలు సూపర్‌వైజర్ రఘుకు నోటీస్ అందజేశారు. హమాలీ సంఘం నాయకులు మల్లుపట్టయ్య, సైదులు,అప్పారావు, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి, కలకొడిమ, మిట్టపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం తెలంగాణా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ సందర్శించి మాట్లాడారు. అకాల వర్షాలతో రైతులు తమ పంట నష్టపోతున్నారని, కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి, కృష్ణయ్య, రామిరెడ్డి, దర్గయ్య, జనార్ధన్, కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో లాభాలెన్నో..

- కలుపు, చీడపీడల నివారణ
- నేల గుల్లబారి తేమ నిల్వ
- పంట అవశేషాలు కాల్చొద్దు..



పంట అవశేషాలను కాల్చుతున్న రైతు



ట్రాక్టర్‌తో లోతు దుక్కులు దున్నిస్తున్న రైతు

బోనకల్: వేసవి లోతు దుక్కులు వేయడం ద్వారా అన్నదాతలకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. కలుపు మొక్కలు చీడపీడలు, శిలీంద్రాలు తొలిగిపోతాయి. నేల గుల్లబారి తేమను నిల్వచేసుకునే శక్తి పెరుగుతుంది. దీని వలన వర్షపు నీరు బాగా ఇంకి భూగర్భ జలాల మట్టం పెరుగుతుంది.

వేసవి లోతు దుక్కుల వలన లాభాలు..

కలుపు మొక్కల నియంత్రణ: లోతు దుక్కులు వేయడం వల్ల కలుపు మొక్కలు ముఖ్యంగా గరిక, తుంగ మొదలైనవి దుంపలతో సహా పెగిలించబడతాయి. దీని వలన కలుపు సమస్య తగ్గుతుంది.

చీడపీడల నివారణ: వేసవి లోతు దుక్కులు వేయడం వల్ల చీడపీడలు, శిలీంద్రాలు ఎండ తాకిడికి, చనిపోతాయి. దీని వలన పంట మొక్కకు తొందరగా చీడపీడలు ఆశించవు.

నేలగుల్లబారి తేమనిల్వ: వేసవి దుక్కులు చేసిన తరువాత నేల గుల్లబారి తేమను నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుంది. తద్వారా వేయబోయే పంటలకు నీటి తడులు తగ్గుతాయి.

భూగర్భజలాలు నీటిమట్టం పెరుగుదల: లోతు దుక్కుల వల్ల వర్షపు నీరు నేలలోకి బాగా ఇంకి భూగర్భ జలాల నీటిమట్టం బాగా పెరుగుతుంది.

పంట దిగుబడి పెరుగుదల: నేల గుల్లబడి తేమ నిల్వ చేయడం వల్ల మొక్కల వేర్లు బాగా విస్తరించి పంట దిగుబడి పెరుగుతుంది.

పశువుల ఎరువు, సేంద్రీయ ఎరువుల వాడకం: వేసవి దుక్కులు వేసేముందు పశువుల ఎరువు, కంపోస్ట్ లేదా చెరువు మట్టిని వాడడం ద్వారా భూమి సారవంతమౌతుంది. గతంలో వేసిన పంటలకు సంబందించి పంట అవశేషాలను భూమిలో కలియదున్నడం వలన అది ఎరువుగా మారి మొక్కకు పోషకాలను అందిస్తుంది. రైతు సోదరులు పంట అవశేషాలను కాల్చకుండా వేసవి దుక్కులు ఎంతగానో ఉపయోగపడతాయి.

ప్రతి ఏటా దుక్కులు వేయిస్తాను..



ప్రతి ఏటా వేసవిలో నాగలితో లోతు దుక్కులు వేయిస్తాను. ఎకరం దున్నడానికి రూ.2వేలు ఖర్చు వస్తుంది. పశువుల ఎరువును పొలంపై చల్లిన తరువాత గతంలో వేసిన పంట అవశేషాలతో కలిపి దుక్కి వేయిస్తాను. దీని వలన చెత్తాచెదారం అడుగు భాగానికి వెళ్లి ఎరువుగా ఉపయోగపడుతుంది. కలుపు నియంత్రణతో పాటు పంటకు వేసే తడులుకూడా తగ్గుతాయి.

– జిడ్డ కృష్ణ, రైతు, ముష్టికుంట్ల

రైతులకు ప్రయోజనం..



రబీకాలం పూర్తి అయిన తరువాత మార్చి, ఏప్రిల్ నెలల్లో వేసవి దుక్కులు లోతుగా వేయడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. నేల గుల్లబారి పంట అధికదిగుబడులు వస్తాయి. దుక్కులు వేయడం ద్వారా భూమికి 2నెలల పాటు విరామం దొరుకుతుంది. పంట అవశేషాలను రైతులు కాల్చకుండా కలియదున్నాలి.

– పసునూరి వినయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి

సకాలంలో యూనిఫాం అందించాలి



లచ్చగూడెంలో పరిశీలిస్తున్న తహసీల్దార్ అనంతరాజు

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సకాలంలో స్కూల్ యూనిఫాం అందించాలని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు అన్నారు. సోమవారం మండలంలోని లచ్చగూడెం కేంద్రంలో తయారు చేస్తున్న స్కూల్ యూనిఫాంను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో నాగులవంచ, పందిళ్లపల్లి, నాగిలిగొండ, నేరడ, లచ్చగూడెం గ్రామాల్లో యూనిఫాం తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి రామారావు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, సీసీ భాస్కర్, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.


గద్దర్ ఐకాన్ అవార్డు అందుకున్న బాలు

తల్లాడ: గద్దర్ ఐకాన్ అవార్డును తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కాంపల్లి బాలు అందుకున్నారు. హైదరాబాద్ బిర్లా సైన్స్ భాస్కర్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సాయి అలేఖ్య సాంస్కృతిక సేవా సంస్థ అరుణ ఉపాధ్యక్ష ఆధ్వర్యంలో గద్దర్ ఐకాన్ అవార్డును శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అందజేశారు. కాంపల్లి బాలు తెలంగాణ ఉద్యమ, జానపద పాటలు రాయడంతో పాటు పాటలు పాడుతున్నారు. తెలంగాణా రాష్ట్ర వ్యాప్తం పలు ప్రదర్శనలిచ్చాడు. కార్యక్రమంలో తెలంగాణా సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల, విమలక్క, వేణుగోపాలచారి, అరుణ అశోక్ పాల్గొన్నారు.

ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా వెంకటేశ్వర్లు

పెనుబల్లి: మండలంలోని టేకులపల్లి మోడల్ స్కూల్‌లో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న పరచా వెంకటేశ్వర్లు ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా గుర్తించి అవార్డు అందించారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన రీజియన్ త్రీ ట్రైనర్ క్యాంపులో నిర్వాహకులు చేతుల మీదుగా వ్యక్తిత్వ శిక్షకుడిగా సర్టిఫికెట్ అందుకున్నాడు. దీంతో వెంకటేశ్వర్లును పలువురు అభినందించారు.

నిఘా నేత్రాలతోనే నేరాల నియంత్రణ



ట్రైయినీ ఐపీఎస్ రిత్విక్‌సాయి

మధిర: నిఘా నేత్రాలతోనే నేరాలను పూర్తిగా అరికట్టవచ్చని మధిర టౌన్ ఎస్‌హెచ్‌ఓ, ట్రైయినీ ఐపీఎస్ కొట్టె రిత్విక్‌సాయి అన్నారు. రూ.4.50 లక్షల ఖర్చుతో పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ఆయన మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏఎన్‌పీఆర్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని బస్టాండ్, ఆర్‌వీ కాంప్లెక్స్, ట్యాంక్‌బండ్, శాంతిథియేటర్, వైఎస్సార్ చౌరస్తా, రెడ్డి గార్డెన్స్, అంబేద్కర్ సెంటర్, రాయపట్నం సెంటర్, లడక్‌బజార్, ఆత్కూర్ క్రాస్‌రోడ్, నందిగామ క్రాస్‌రోడ్, శివాలయం వద్ద నిఘా నేత్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే నిందితులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

వినతుల వెల్లువ..

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై..



ముదిగొండ: ధర్నా చేస్తున్న ప్రజలు, బీఆర్‌ఎస్ నాయకులు

ఏన్కూరు/ఎర్రుపాలెం/ముదిగొండ: ఏన్కూరు మండలంలోని రేపల్లెవాడ గ్రామానికి చెందిన గుగులోతు స్వాతి తనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేయాలని కోరుతూ.. సోమవారం తహసీల్‌లో జరిగిన గ్రీవెన్స్‌డేలో తహసీల్దార్ శేషగిరిరావుకు వినతిపత్రం అందజేసింది. అదే విధంగా ఎర్రుపాలెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో నిరుపేదలు దేవరకొండ పిచ్చమ్మ, కందుకూరు కృష్ణయ్య, బుజ్జి, ప్రసాద్, జ్ఞానేందర్‌రావు రాములు, బీజేపీ నాయకుడు కోటేశ్వరరావుతో కలిసి తహసీల్దార్ ఉషాశారదకు వినతిపత్రం అందించారు. ముదిగొండలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పలుగ్రామాల ప్రజలు ధర్నా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ వాల్మికి కిషోర్‌కి, తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందజేశారు. అర్హుల జాబితాను వెల్లడించాలని, లేకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అర్హులకు ఇళ్లు రాకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ కృష్ణశ్రీ, ఐకేపీ ఏపీఎం హరినారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు హరిప్రసాద్, ప్రసాద్, మల్లయ్య, వెంకట్రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై తహసీల్దార్‌కు..

వైరా: రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్నీ బ్యాగులు, లారీలు రైతులకు అందుబాటులో ఉంచి సకాలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కేవీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకులు శ్రీనివాసరావు, కృష్ణ, నరసింహారావు, రాజేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న కమ్మసేవా సంఘం నాయకులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జవహర్‌నగర్‌కు చెందిన కలపాల నగేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో పాటు పక్షవాతానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. ఆర్‌కే ఫౌండేషన్ ద్వారా సోషల్ మీడియాలో తెలుసుకొని సత్తుపల్లి కమ్మ సేవా సమితి ఆధ్వర్యాన రూ.25వేల నగదును సోమవారం బాధితుడికి అందించారు. కార్యక్రమంలో కమ్మసేవా సమితి బాధ్యులు చల్లగుళ్ల నర్సింహారావు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆసరాగా..



చెక్కు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం జెడ్పీహెచ్ఎస్‌లో పది చదివిన 1989 సంవత్సర బ్యాచ్ విద్యార్థులు.. తమ స్నేహితుడు రవికుమార్‌కి ఆర్థిక సాయంగా రూ.55వేలు చెక్కు అందించారు. రవికుమార్ తాను పనిచేస్తున్న క్రమంలో గానుగ మిల్లులో తన కుడిచేయి పడి విరగడంతో పాటు నరాలు తెగాయి. దీంతో అతనికి ఆపరేషన్ చేయించారు. విషయం తెలుసుకున్న మిత్రులు తమవంతు సాయంగా ఈ నగదు అందించారు. నరసింహారావు, షేక్.ఇబ్రహీం, వినోదలక్ష్మి, జ్యోతి, కిరణ్‌కుమార్, రవికుమార్, వెంకటుగురునాథం పాల్గొన్నారు.

పాకిస్తానీయులను బహిష్కరించాలి



తల్లాడ: ఎస్సై కొండల్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మధిర: దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను, బంగ్లాదేశీయులను దేశం నుంచి బహిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో నాయిబ్ తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు చిలువేరు సాంబశివరావు, గుండా చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. పాకిస్తాన్‌మద్దతుతో ఆశ్రయం పొందిన ఉగ్రవాదులు దేశంలో అల్లర్లు సృష్టిస్తూ అమాయక ప్రజలను బలిగొంటున్నారన్నారు. అనంతరం ట్రైయినీ ఐపీఎస్ కొట్టె రిత్విక్‌సాయికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివరాజు సుమంత్, గడ్డం శ్రీహరిచౌదరి, కుంచం కృష్ణారావు, ఖాజామియా, నాగేంద్రబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి: రోహింగ్యాలను గుర్తించి వెంటనే పంపివేయాలంటూ బీజేపీ మండల అధ్యక్షులు బొర్రా నరసింహారావు ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మధుసూధన్‌రావు, రాము, మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్ బి.కొండల్‌రావు లకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నరేష్, సాయిచంద్, వెంకటేశ్వర్లు, రామారావు, వెంకటయ్య పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రాంతంలో నివసించే అక్రమ వలస దారులను గుర్తించాలని బీజేపీ నాయకులు సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివకృష్ణ, మధుసూదన్, నరేష్, నాగస్వామి, రహీంతుల్లా, విజయ్, వసంతరావు పాల్గొన్నారు.

ఏన్కూరు: ఏన్కూరులో నివసించే పాకిస్థానీయులను బహిష్కరించాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఎస్సై రఫీలకు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు బొల్లి వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటేశ్వరావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలను అరికడదాం



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న సత్తుపల్లి డీఈఈ ఎల్. రాములు



వైరా: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

మధిర/వైరా/సత్తుపల్లిటౌన్: విధి నిర్వహణలో భద్రత నియమాలు విద్యుత్ ప్రమాదాలను అరికట్టడంలో అందరూ భాధ్యతగా వ్యవహరించాలని విద్యుత్ శాఖ వైరా, సత్తుపల్లి డీఈఈలు బండి శ్రీనివాసరావు, ఎల్.రాములు తెలిపారు. సోమవారం మధిర పట్టణంలోని పీవీఆర్ ఏసీ కల్యాణ మండపంలో, వైరాలోని రైతు వేదిక వద్ద, సత్తుపల్లిలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విద్యుత్ భద్రత వారోత్సవాల సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. ఉద్యోగులు స్తంభాలు ఎక్కేటప్పుడు..విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మత్తుల సమయంలో అజాగ్రత్తగా ఉండకుండా.. అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం వైరాలో విద్యుత్ వారోత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మధిర, సత్తుపల్లి, వైరా సబ్ డివిజన్ ఏడీఈలు అనురాధ, ప్రసాద్, కిరణ్‌కుమార్, ఏఈ లు శరత్‌బాబు, కావ్య, అంకారావు, ఎస్.అనీల్ కుమార్, ఎస్.మైథిలి, వి.గణేష్, జి.అనూష, సుందర్‌కుమార్, వెంకటసాయి, మనోహర్ కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'



మధిర: మాట్లాడుతున్న శాస్త్రవేత్త రుక్మిణీదేవి

మధిర: మధిర వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంపాడు రైతువేదికలో 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు'కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణీదేవి మాట్లాడుతూ.. రైతులు యూరియా వాడకం తగ్గించుకోవడం వల్ల సాగుఖర్చు కలిసి వస్తుందన్నారు. రసాయనాలు తగ్గించుకోవడం వల్ల నేలతల్లి ఆరోగ్యం కాపాడుకోవచ్చని సూచించారు. పంట మార్పిడితో పంటలకు చీడపీడలు ఆశించకుండా చూసుకోవచ్చునని, రైతులు పంట మొదలు పెట్టిన నాటి నుంచి కోసే వరకు ఉన్న రశీదులను భద్రపరచుకోవాలని తెలిపారు. అంతర్ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏఓ సాయిదీక్షిత్ మాట్లాడుతూ.. పచ్చిరొట్టలు వేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను, వేసవిలో దుక్కిదున్నుకోవడం వల్ల జరిగే ప్రయోజనాలను వివరించారు. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. అనంతరం రైతు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సమావేశంలో ఏఈఓ సుష్మ, రైతులు పాల్గొన్నారు.

రాయన్నపేట గ్రామంలో..

బోనకల్: మండలంలోని రాయన్నపేట గ్రామంలోని రైతువేదికలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'కార్యక్రమాన్ని సోమవారం మధిర పరిశోధన స్థానం శాస్త్రవేత్త భరత్, మధిర ఏడీఏ ఎస్.విజయచంద్ర ప్రారంభించారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల్లో ఫార్మర్ రిజిస్టర్ కార్యక్రమాన్ని మొదలు పెట్టడం జరిగిందని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మాకమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరావు, ఏఓ వినయ్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరి



ఫార్మర్ ఐడీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ నర్సింహారావు

ఎర్రుపాలెం: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాన్ని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ గోపి, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు తల్లపురెడ్డి నాగిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రసాదరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జగనాథపురంలో..

చింతకాని: రైతులందరూ రైతు గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్ చంద్ర పేర్కొన్నారు. జగన్నాధపురం రైతువేదికలో నిర్వహిస్తున్న రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ రైతు నంబర్‌లింక్ అయిన ఆధార్‌కార్డుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, దీంతో కేంద్ర పథకాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ మానస, వ్యవసాయ విస్తర్ణాధికారులు రాము, కార్తీక్, కల్యాణి, తాహియా నౌషీన్, తేజ, ఆయేషా, రైతులు పాల్గొన్నారు.

మండలంలోని ఐదు గ్రామాల్లో..

వైరారూరల్: మండలంలోని దాచాపురం, కొండకొడిమ, అష్టగుర్తి, నారపునేనిపల్లి, తాటిపూడి గ్రామాల్లో సోమవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంర్భంగా ఏఓ మయాన్ మంజుఖాన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ సపావత్ సైదులు, రైతులు పాల్గొన్నారు.

సత్తుపల్లి మండలంలో..



కొత్తూరులో పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లిరూరల్: మండలంలోని కొత్తూరు, గంగారం, కాకర్లపల్లి గ్రామాల్లో పోర్టల్‌లో నమోదు కార్యక్రమాలను సత్తుపల్లి ఏడీఏ డి.శ్రీనివాసరెడ్డి సోమవారం పరిశీలించారు. నెలరోజుల పాటు గ్రామాల వారీగా నమోదు ప్రక్రియ నిర్వహించబడుతుందన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావు, ఏఈఓలో అనూష, సాయి, వాసంతి, నరేష్ పాల్గొన్నారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

కొణిజర్ల: మండలంలో మంగళవారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పర్యటించి రూ. 10.50 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ప్రకటన విడుదల చేశారు. కొణిజర్ల నుంచి తనికెళ్ల వరకు పొలాల మీదుగా నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. రాజ్యాతండ, చిన్నగోపతి, గోపవరం, కొండవనమాల, కాచారం గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. చిన్నమునగాలలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

పెనుబల్లి: టేకులపల్లి మోడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఇర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీబీ రూపస్ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 5 నుండి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అటెన్షన్ ప్లీజ్



మరమ్మతులు చేయరూ..



పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

ముదిగొండ మండలంలోని న్యూలక్ష్మీపురంలో గత కొద్ది రోజుల నుంచి ప్రధాన బీటీ రహదారిపై ఇంటింటికీ అందించే భగీరథ నీటి పైప్‌లైను పగిలి రోడ్డుపై నీరు వృథాగా పోతుంది. దీంతో రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. అసలే కంకర రోడ్డు అంటే రోడ్డుపై భగీరథ నీరు.. దీంతో రాకపోకల సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు కల్పించుకొని మరమ్మతులు చేయించి నీరు వృథా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : సురేష్, న్యూలక్ష్మీపురం జీపీ కార్యదర్శి
సెల్ నంబర్ : 9441321688